క్లుప్తంగా

8న మండల సర్వసభ్య సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని రైతువేదికలో ఈనెల 8న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహిద్దీన్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జాగ్రత్తలు పాటించాలి



గట్టు: ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. మండలంలోని తుమ్మలచెరువు, బస్వాపురం గ్రామాల్లో శనివారం ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ ఎన్‌జీఓల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, భవిష్య భారత్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, టెక్నీషియన్ సునీల్, ఫార్మసిస్ట్ అరుణ, ఎంఎంయూ ఆపరేటర్ సహాదేవుడు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



గట్టు: ఓపెన్ స్కూల్‌లో ఎస్ఎస్‌సీ, ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కొండారెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పరుశరాం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ఆగస్టు 10తో ముగియనున్నట్లు తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో చేరేందుకు చక్కటి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు గట్టు ఉన్నత పాఠశాలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం ఓబులేష్, ఉపాధ్యాయులు శివశంకర్, నర్సింహులు, నర్సింహులుగౌడ్, హాజీపాషా, రాజుసాగర్, సరిత పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మల్దకల్: లెప్రసీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేశారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు మందులను అందజేశారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శ్రీధర్, నాగేంద్రం, సత్యమ్మ ఉన్నారు.

పనుల పరిశీలన



అలంపూర్ రూరల్: మండలంలోని కోనేరులో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఎంపీఓ చంద్రకళ పరిశీలించారు. వైకుంఠధామంలో సోలార్ లైట్ ఏర్పాటుతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని సర్పంచ్ లక్ష్మన్న, కార్యదర్శి కవితకు సూచించారు.

సర్వేపై అవగాహన



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో శనివారం కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వేపై నోడల్ పర్సన్ బాలీశ్వరయ్యశెట్టి ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. రోజు 20 ఇండ్లను సర్వే చేసి అనుమానితుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. 14రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కొదండాపురం ఎస్ఐ కృష్ణదేవా శనివారం తెలిపారు. సాసనూలుకు చెందిన పెంచలయ్యపై అదే గ్రామానికి చెందిన పరుశరాముడు కోడి విషయంపై దాడి చేసి కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పరుశరాముడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు మేలు

- ముర్రుపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి
- ఆరునెలల వరకు తల్లిపాలే ఇవ్వాలి
- డీడబ్ల్యూఓ ముషాయిదాబేగం



గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్‌లో అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూఓ ముషాయిదాబేగం

గద్వాల అర్బన్: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని, పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించాలని డీడబ్ల్యూఓ ముషాయిదాబేగం అన్నారు. మండలంలోని శెట్టి ఆత్మకూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. బిడ్డకు ఆరునెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. బాలింతలు, గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని మండల వైద్యాధికారిణి ప్రసూణరాణి సూచించారు. మండలంలోని క్యాతూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆరునెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

గట్టు: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి సూచించారు. మండలంలోని పెంచికలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు బిడ్డకు తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శశికళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, విజయ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ అన్నారు. మండలంలోని గువ్వలదిన్నెలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతోపాటు తల్లీబిడ్డకు అనుబంధం పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, లక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.



పెంచికలపాడులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



గువ్వలదిన్నెలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ

పశువులకు టీకాలు వేయించాలి



గుడుదొడ్డిలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్వరూపారాణి

అయిజ: వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి ప్రబలకుండా టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. మండలంలోని గుడుదొడ్డి, కిషాన్‌నగర్ గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధితో పశువులు నీరసించిపోతాయని, పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. వ్యవసాయ పనులు చేసే ఎద్దులు నీరసించి పని చేయలేవని, నోట్లో పుండ్లు ఏర్పడి ఆహారం తీసుకోలేవన్నారు. కాలిగిట్టల్లో పుండ్లు ఏర్పడి నడవలేని స్థితికి చేరుతాయన్నారు. వ్యాధి ముదిరితే పశువులు మృతి చెందే అవకాశముందని, రైతులందరూ తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాలను తెల్లవారుజాము నుంచే భక్తులు సందర్శించి పూజలు చేశారు. పలువురు దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుందాం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

అయిజ: పట్టణంలో శుభ్రత, పచ్చదనం పెంచి సుందరంగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, కమిషనర్ నర్సయ్య అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రధాన రహదారి సెంట్రల్ లైన్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయిచూరు–కర్నూలు రోడ్డు నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు రోడ్డు విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. రహదారిపై సెంట్రల్ లైటింగ్‌తోపాటు మొక్కలు పెంచి సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్, బీఆర్ఎస్ నాయకుడు మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ పనులు వేగవంతం చేయాలి



బయోగ్యాస్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి ఉన్నత పాఠశాలలో చేపట్టిన బయోగ్యాస్ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు. బయోగ్యాస్ ఏర్పాటుకు సంబంధించిన పనులను శనివారం పరిశీలించారు. అదేవిధంగా మనఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్లు, వంటగది నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. మనఊరు–మనబడి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. వంటగది ఏర్పాటుకు కొంత స్థలం కేటాయించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఫోర్ వీలర్ డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక

అలంపూర్: జోగుళాంబ అలంపూర్ క్రాస్‌రోడ్డు ఫోర్ వీలర్ డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీని శనివారం చౌరస్తాలోని మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. అధ్యక్షుడిగా నర్సన్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా తిరుపతినాయుడు, గౌరవాధ్యక్షుడిగా వెంకటస్వామి, గౌరవ సలహాదారుగా గజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్ణాకర్, సహాయ కార్యదర్శులుగా గనిమియ్యా, విజయ్‌గౌడ్, కోశాధికారిగా షమీఉల్లా, ప్రచార కార్యదర్శులుగా రామచంద్రుడు, ప్రభాకర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం క్యాబ్, మోటర్‌రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న రవాణాశాఖ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, వెంకటేశ్వర్లు, మాలిక్ భాషా, రాఘవేంద్ర, మహేష్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తాలో శనివారం బీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రైతులు తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నారాయణనాయుడు, సుదర్శన్‌రెడ్డి, రవిప్రకాష్, పరిపూర్ణ, లోకారెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



గోకారమయ్య దర్గాలో భక్తుల రద్దీ

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్‌లో శనివారం గోకారమయ్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గోకారమయ్య దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ఆవరణలో వెలసిన దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

గద్వాల అర్బన్: ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పి విస్మరించడం సరికాదన్నారు. సెకండ్ ఏఎన్ఎంలు, ఈసీ, కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం శుక్రవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టిన సెకండ్ ఏఎన్ఎంలను అరెస్టు చేసి రాత్రి వరకు పోలీస్‌స్టేషన్లలో ఉంచడం దుర్మార్గమన్నారు. ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా జెడ్పీ చైర్‌పర్సన్ సరితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రంగన్న, పద్మమ్మ, విద్యావతి, ప్రమీల, పరిమిళ, జ్యోతి, లక్ష్మి, నర్మద, సంధ్యారాణి, స్వప్న, శ్రీలేఖ పాల్గొన్నారు.

హెచ్‌బీఎన్‌సీ కిట్ల పంపిణీ



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో శనివారం హెచ్‌బీఎన్‌సీ (గృహ ఆధారిత నవజాత శిశు సంరక్షణ) కిట్లను మండల వైద్యాధికారిణి ప్రసూణరాణి ఆశ కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్ఏ బాలీశ్వరయ్యశెట్టి పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మానవపాడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించాలని బీజేపీ యువమోర్చా నాయకులు ప్రశాంత్, జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.3,016 చెల్లించడంతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, లాలూ, శివ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాముడు

గద్వాల వ్యవసాయం: పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గోపాలమిత్ర అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గొల్ల రాముడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్వీఆర్ హాల్‌లో గోపాలమిత్రల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23ఏళ్లుగా గోపాలమిత్రలు చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు కృత్రిమ గర్భధారణ, ప్రథమ చికిత్సలు, వ్యాక్సినేషన్ చేస్తూ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఏలుగా అవకాశం కల్పించి.. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కోశాధికారి ఠాగూర్ నాయుడు, ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ ఉన్నారు.

సరుకులు అందజేత

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో ఇటీవల మట్టి మిద్దె కూలిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం బాధిత కుటుంబ సభ్యులను బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రభుదాసు పరామర్శించి.. నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శోభగౌడ్, శివశంకర్‌గౌడ్, రాజు, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.

అదుపు తప్పిందా.. అంతే!



గుంతలమయంగా మారిన కాశీపూర్ రోడ్డు

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్ వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం వందలాది మంది కర్నూల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం గోతులమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న రాజగోపాల్

శాంతినగర్: గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే బీజేపీని ఆదరించాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లిలో శనివారం ఇంటింటా బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో సుపరిపాలన కొనసాగుతుందని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహులు, అయ్యరాజు, తులసీరాం, బలరాం, వినోద్, శ్రీను, గోవిందు, మద్దిలేటి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వేములలో బహుజన ధూంధాం



ధూంధాంలో కళాకారుల ఆటాపాట

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం వేములలో శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజన ధూంధాం నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజనులకు జరుగుతున్న అన్యాయంపై కళాకారులు ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలంటే రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలన్నారు. బహుజనుల జీవితాలు బాగుపడేందుకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖ మంత్రికి వినతి



మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ధరూరు: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములుతో కలిసి అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిరమ్మ, ప్రధాన కార్యదర్శి వెంకటరామమ్మ, వీరమ్మ మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. అంగన్‌వాడీ టీచర్లను రెగ్యులరైజ్ చేయడంతోపాటు బీమా సౌకర్యం కల్పించి, హెల్త్‌కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరి, సుజాత, వనజాక్షి, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, సుమేరాబేగం, అనిత పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు బాసట

గద్వాల అర్బన్: ప్రజా పోరాటాలకు ప్రజానాట్య మండలి పాటలు బాసటగా నిలుస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు అక్బర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మతం పేరుతో మనుషులను విడదీసి అల్లర్లు సృష్టిస్తోందన్నారు. ఇలాంటి సందర్భంలో మనుషులందరూ ఒక్కటే అనే నినాదంతో ప్రజానాట్య మండలి పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ప్రజానాట్య మండలి కార్యదర్శి ఆశన్న మాట్లాడుతూ ఈనెల 15న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు దేశభక్తిపై పాటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సత్యం, తిరుమలేష్, బీకే ఈదన్న, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు, అయ్యప్ప తదితరులు ఉన్నారు.